21-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మేము భగవానువాచనే వింటున్నాము, స్వయంగా భగవంతుడే మమ్మల్ని చదివిస్తున్నారు అన్న నిశ్చయము ఎప్పుడైతే పూర్తిగా ఉంటుందో, అప్పుడే సదా సంతోషములో ఉండగలుగుతారు"

ప్రశ్న:- డ్రామానుసారంగా ఈ సమయంలో అందరూ ప్లాన్లు ఏమి తయారుచేస్తారు మరియు ఏర్పాట్లు ఏమి చేస్తారు?

జవాబు:- ఈ సమయంలో అందరూ ప్లాన్లు తయారుచేస్తారు - ఇన్ని సంవత్సరాలలో ఇంత ధాన్యాన్ని పండిస్తాము, కొత్త ఢిల్లీ, కొత్త భారత్ తయారవుతుంది అని. కానీ ఏర్పాట్లు మృత్యువు కొరకు చేస్తూ ఉంటారు. మొత్తం ప్రపంచమంతటి కంఠములో మృత్యుహారము పడి ఉంది. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు... అన్న నానుడి ఉంది. తండ్రి ప్లాన్ తండ్రిది, మనుష్యుల ప్లాన్ మనుష్యులది.

పాట:- ఎవరో నన్ను తనవారిగా చేసుకొని... (కిసీ నే అప్నా బనాకే ముఝుకో...)

ఓం శాంతి. బ్రహ్మ తనువు ద్వారా నిరాకార భగవానువాచ. ఇక్కడ మనుష్యమాత్రులెవ్వరూ చదివించడం లేదని, నిరాకార భగవంతుడు చదివిస్తున్నారని మొదట ఈ విషయాన్ని పక్కా చేసుకోవాలి. వారిని ఎల్లప్పుడూ పరమపిత పరమాత్మ శివ అని అంటారు. బెనారస్ లో శివుని మందిరము కూడా ఉంది కదా. ఆత్మకు మొట్టమొదట - మమ్మల్ని అనంతమైన తండ్రి చదివిస్తున్నారు అన్న నిశ్చయముండాలి. ఎప్పటివరకైతే ఈ నిశ్చయము ఉండదో, అప్పటివరకు మనుష్యులు ఎందుకూ పనికిరారు, గవ్వతుల్యముగానే ఉంటారు. తండ్రిని తెలుసుకోవడంతో వజ్రతుల్యముగా అవుతారు. గవ్వతుల్యముగా కూడా భారత్ యొక్క మనుష్యులే అవుతారు, అలాగే వజ్రతుల్యముగా కూడా భారత్ యొక్క మనుష్యులే అవుతారు. తండ్రి వచ్చి మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. మొదట ఎప్పటివరకైతే భగవంతుడు చదివిస్తున్నారు అన్న నిశ్చయము ఉండదో, అప్పటివరకు వారు ఈ కాలేజీలో కూర్చున్నా ఏమీ అర్థం చేసుకోనట్లే. ఆ సంతోషపు పాదరసము పైకి ఎక్కదు. వారు మన అతి ప్రియమైన తండ్రి, వారిని భక్తి మార్గంలో దుఃఖపు సమయంలో - ఓ పరమాత్మా, దయ చూపండి అని పిలిచేవారు. ఈ విధంగా ఆత్మయే అంటుంది. లౌకిక తండ్రి ఉన్నా కూడా తాము ఏ తండ్రిని తలుచుకుంటున్నారు అనేది మనుష్యులు అర్థం చేసుకోరు. ఆత్మ నోటి ద్వారా - వీరు నా లౌకిక తండ్రి, వీరు నా పారలౌకిక తండ్రి అని అంటుంది. మీరు ఇప్పుడు దేహీ-అభిమానులుగా అయ్యారు, మిగిలిన మనుష్యులంతా దేహాభిమానులుగా ఉన్నారు. వారికి ఆత్మ మరియు పరమాత్మల గురించి తెలియనే తెలియదు. ఆత్మలమైన మనము ఆ పరమపిత పరమాత్ముని పిల్లలము - ఈ జ్ఞానం ఇంకెవ్వరికీ లేదు. తండ్రి మొట్టమొదట ఈ నిశ్చయాన్ని కలిగిస్తారు - భగవానువాచ, నేను మీకు ఈ రాజయోగాన్ని నేర్పిస్తాను. మీరు దేహ సహితంగా దేహపు సంబంధాలేవైతే ఉన్నాయో, వాటిని మరచి స్వయాన్ని ఆత్మగా నిశ్చయము చేసుకొని తండ్రినైన నన్ను స్మృతి చేయండి. ఏ మనుష్యులు లేక కృష్ణుడు మొదలైనవారు ఈ విధముగా అనలేరు. ఇదంతా అసత్యమైన మాయ, అసత్యమైన తనువు, అసత్యమైన ప్రపంచము. ఒక్కరు కూడా సత్యమైనవారు లేరు. మళ్ళీ సత్యఖండములో అసత్యమైనవారు ఒక్కరు కూడా ఉండరు. ఈ లక్ష్మీ-నారాయణులు సత్యఖండానికి యజమానులుగా ఉండేవారు, పూజ్యులుగా ఉండేవారు. ఇప్పుడు భారతవాసులు ధర్మభ్రష్టులుగా, కర్మభ్రష్టులుగా అయి ఉన్నారు, కావుననే భ్రష్టాచారీ భారత్ అన్న పేరు ఉంది. శ్రేష్ఠాచారీ భారత్ సత్యయుగములో ఉంటుంది. అక్కడ అందరూ సదా చిరుమందహాసంతో ఉంటారు, ఎప్పుడూ రోగగ్రస్థులుగా, అనారోగ్యం కలవారిగా అవ్వరు. ఇక్కడ ఫలానావారు స్వర్గస్థులయ్యారని అంటారు, కానీ ఎవరికీ ఏమీ తెలియదు. ఈ సమయంలోని రాజ్యము కూడా ఎండమావుల సమానమైనది. లేడి కథ ఒకటి ఉంది కదా - నీరు అనుకొని లోపలికి వెళ్తుంది మరియు ఆ ఊబిలో చిక్కుకుపోతుంది. కావున ఈ సమయంలో ఊబి వంటి రాజ్యం ఉంది. ఎంతగా అలంకరిస్తారో అంతగా ఇంకా పడిపోతూ ఉంటారు. భారత్ లో ధాన్యం ఎంతో ఉంటుంది, ఇది ఉంటుంది, అది ఉంటుంది... అని అంటూ ఉంటారు. కానీ ఏమీ ఉండదు. దీనినే తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లు అని అంటారు. తండ్రి అంటారు, ఇది రాజ్యమేమీ కాదు. ఎక్కడైతే రాజు-రాణి ఉంటారో దానిని రాజ్యం అని అంటారు. ఇది ప్రజలపై ప్రజల రాజ్యము. అధర్మయుక్తమైన, అసత్యమైన రాజ్యము ఉంది. భారత్ లో ఆది సనాతన దేవీ-దేవతల రాజ్యం ఉండేది. ఇప్పుడు ఎంత ధర్మభ్రష్టులుగా, కర్మభ్రష్టులుగా అయిపోయారు. తమ ధర్మం గురించి తెలియని దేశమంటూ ఇంకేదీ లేదు. ధర్మమే శక్తి అని కూడా అంటారు. దేవతలదైతే మొత్తం విశ్వమంతటిపైనా రాజ్యం ఉండేది, ఇప్పుడు పూర్తిగా నిరుపేదలుగా ఉన్నారు. బయట నుండి ఎంతగా సహాయం

తీసుకుంటున్నారు. వారికి బాహుబలం యొక్క సహాయం ఉంది, మీకు యోగబలం యొక్క సహాయం ఉంది. అతి ప్రియమైన తండ్రి నుండి మనకు 21 జన్మలు కొరకు సదా సుఖపు వారసత్వము లభిస్తుందని పిల్లలైన మీకు తెలుసు. అక్కడ ఎప్పుడూ దుఃఖము, ఏడవటము మొదలైనవాటి విషయమే ఉండదు. ఎప్పుడూ అకాలమృత్యువులు జరగవు. అలాగే ఈ రోజుల్లో జరుగుతున్నట్లుగా నలుగురు-ఐదుగురు పిల్లలకు కలిపి ఒకేసారి జన్మనివ్వడం జరగదు. ఒకవైపు చూస్తే తినడానికి ఏమీ లేదు, పిల్లలకు జన్మనివ్వడం తగ్గించండి అని అంటారు. తాను ఒకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లు జరుగుతుంది! కొత్త ఢిల్లీ, కొత్త రాజ్యం ఉంది అని భావిస్తారు. కానీ ఏమీ లేదు. మృత్యువు అందరి మెడలో పడి ఉంది. మృత్యువు కొరకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. తప్పకుండా 5,000 సంవత్సరాల క్రితం వలె ఇది ఆ మహా భారత యుద్ధమే. తండ్రి అంటారు, ఇది రాజ్యమేమీ కాదు, ఇది ఎండమావుల వంటిది. ద్రౌపది ఉదాహరణ కూడా ఉంది కదా. మీరందరూ ద్రౌపదులే. ఈ వికారాలపై విజయం పొందండి అని మీకు తండ్రి ఆజ్ఞ ఉంది. మేము సదా పవిత్రముగా ఉంటూ భారత్ ను పవిత్రముగా తయారుచేస్తాము అని మనము ప్రతిజ్ఞ చేస్తాము. ఈ పురుషులు పవిత్రముగా ఉండనివ్వరు. కొంతమంది గుప్త గోపికలు - వీరు మమ్మల్ని కొడుతున్నారు అని ఎంతగానో పిలుస్తారు.

ఈ కామము మహాశత్రువు అని, ఇది ఆదిమధ్యాంతాలు దుఃఖాన్ని ఇస్తుందని మీకు తెలుసు. తండ్రి అంటారు, దీనిపై మీరు విజయం పొందాలి. గీతలో కూడా - కామము మహాశత్రువు అని భగవానువాచ ఉంది. కానీ మనుష్యులు అర్థం చేసుకోరు. తండ్రి అంటారు - పవిత్రముగా అవ్వండి, అప్పుడు మీరు రాజులుకే రాజులుగా అవుతారు. ఇప్పుడు చెప్పండి, రాజులుకే రాజులుగా అవ్వాలా లేక పతితులుగా అవ్వాలా? ఈ ఒక్క అంతిమ జన్మ నా కోసం పవిత్రంగా అవ్వండి అని తండ్రి అంటారు. అపవిత్ర ప్రపంచ వినాశనం మరియు పవిత్ర ప్రపంచ స్థాపన జరుగుతుంది. అర్ధకల్పం మీరు విషాన్ని తాగుతూ-తాగుతూ ఇంతటి దుఃఖాన్ని చూసారు, మీరు ఈ ఒక్క జన్మ దీనిని వదలలేరా? ఇప్పుడు పాత ప్రపంచ వినాశనము మరియు కొత్త ప్రపంచ స్థాపన జరుగుతోంది. ఇందులో ఎవరైతే పవిత్రముగా అవుతారో మరియు తయారుచేస్తారో వారే ఉన్నత పదవిని పొందుతారు. ఇది రాజయోగము. మేము బ్రహ్మాకుమార-కుమారీలము కావున తప్పకుండా ప్రజాపిత బ్రహ్మాకు సంతానము కూడా అని మీరు అంటారు. బ్రహ్మా శివుని కుమారుడు, మీకు వారసత్వాన్ని ఇచ్చేవారు శివుడు. ఇది నిరాకారుడైన గాడ్-ఫాదర్లీ యూనివర్శిటీ. స్వర్గ స్థాపన చేసేవారు, వారసత్వాన్ని ఇచ్చేవారు ఆ శివుడే. ఆ గాడ్-ఫాదర్, ఆనందసాగరుడు, జ్ఞానసాగరుడు అయిన తండ్రి కూర్చొని చదివిస్తారు. కానీ ఎప్పుడైతే దేహాభిమానం తొలగిపోతుందో అప్పుడే బుద్ధిలో కూర్చుంటుంది. భాగ్యములో లేకపోతే మరి ధారణ కూడా జరుగదు. తప్పకుండా మీరు జగత్పితకు పిల్లలు. బ్రహ్మాకుమార-కుమారీలు రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. మీ స్మృతిచిహ్నమే నిలబడి ఉంది. ఈ మందిరము ఎంత బాగుంది! దీని అర్థము పిల్లలైన మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. పూజలు చేస్తూ, తల వంచి నమస్కరిస్తూ ధనమంతటినీ పోగొట్టుకున్నారు. ఇప్పుడు పూర్తిగా గవ్వతుల్యముగా అయిపోయారు. తినడానికి భోజనం లేదు, ఇప్పుడిక పిల్లలకు జన్మనివ్వడం తగ్గించండి అని అంటారు. కామం మహాశత్రువు అని చెప్పే శక్తి మనుష్యులెవ్వరికీ లేదు. పిల్లలకు జన్మనివ్వడం తగ్గించండి అని ఎంతగా చెప్తూ ఉంటారో, అంతగా ఇంకా ఎక్కువ జన్మనిస్తూ ఉంటారు. ఈ విషయంలో ఎవరి శక్తి పని చేయడం లేదు.

ఇది గాడ్ ఫాదర్లీ యునివర్శిటీ అని, భగవంతుడు ఒక్కరే అని పిల్లలైన మీరు మొట్టమొదట ఈ విషయాన్ని అర్థం చేయించాలి. సదా తిరుగుతూ ఉండే చక్రము ఇదొక్కటే. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు. మిత్ర-సంబంధీకులు మొదలైనవారికి కూడా ఈ ఆత్మిక యాత్ర యొక్క రహస్యాన్ని అర్థం చేయించాలి. దైహిక యాత్రలనైతే జన్మ-జన్మాంతరాలుగా చేసారు, ఈ ఆత్మిక యాత్ర ఒక్కసారే జరుగుతుంది. అందరూ తిరిగి వెళ్ళాలి. పతితులెవ్వరూ ఇక్కడ ఉండేది లేదు. ఇప్పుడు ఇది వినాశన సమయము. ఈ కోట్లాదిమంది మనుష్యులెవరైతే ఉన్నారో, వీరందరూ సత్యయుగములో ఉండరు, అక్కడ చాలా కొద్దిమందే ఉంటారు. అందరూ తిరిగి వెళ్ళాలి. తండ్రి తిరిగి తీసుకువెళ్ళేందుకే వచ్చారు - ఎప్పటివరకైతే ఇది అర్థం చేసుకోరో అప్పటివరకూ మధురమైన ఇల్లు మరియు సుఖధామము గుర్తుకురావు. స్మృతి చేయడమైతే చాలా సహజము. తండ్రి అంటారు, మధురమైన ఇంటికి పదండి. నేను తప్ప మిమ్మల్ని ఇంకెవ్వరూ తీసుకువెళ్ళలేరు. నేనే కాలుడికే కాలుడిని. ఎంత బాగా అర్థం చేయిస్తారు. కానీ ఆశ్చర్యమేమిటంటే ఇన్ని సంవత్సరాలుగా ఉంటూ కూడా ధారణ జరుగదు. కొందరు చాలా చురుకైనవారిగా అవుతారు, కొందరు ఏమీ అర్థం చేసుకోరు. అలాగని, పాతవారి పరిస్థితే ఇలా ఉంటే మరి మా పరిస్థితి ఏమిటి అన్నట్లు కాదు. అలా కాదు. స్కూల్లో అందరూ నంబరువన్ గా ఏమైనా ఉంటారా. ఇక్కడ కూడా నంబరువారుగా ఉన్నారు. అనంతమైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునే సమయం ఇదే, 21 జన్మల వరకూ సదా సుఖపు వారసత్వాన్ని పొందాలి అని అందరికీ

అర్థం చేయించాలి. ఎంతమంది బ్రహ్మాకుమార-కుమారీలు పురుషార్థము చేస్తున్నారు. నంబరువారుగా అయితే తప్పకుండా ఉంటారు.

పతిత-పావనుడు ఒక్క తండ్రేనని మీకు తెలుసు. మిగిలినవారంతా పతితులే. తండ్రి అంటారు, సర్వుల సద్గతిదాత ఒక్కరే, వారే స్వర్గ స్థాపన చేస్తారు. ఆ తర్వాత కేవలం భారత్ మాత్రమే ఉంటుంది, మిగిలినదంతా వినాశనమైపోతుంది. మనుష్యుల బుద్ధిలో ఈ మాత్రం విషయం కూడా కూర్చోదు. తండ్రి అంటారు - పిల్లలూ, నాకు సహాయకులుగా అయినట్లయితే నేను మిమ్మల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తాను. పిల్లలు ధైర్యాన్ని ఉంచితే, తండ్రి సహాయం చేస్తారు. ఈశ్వరీయ సేవాధారులు అని గాయనమైతే చేస్తారు. వాస్తవానికి వారంతా దైహిక ముక్తిదళము. సత్యాతి-సత్యమైన ఆత్మిక ముక్తిదళము మీరే. భారత్ యొక్క నావ ఏదైతే మునిగిపోయి ఉందో, దానిని రక్షించేవారు భారతమాత శక్తి అవతారములైన మీరే. మీరు గుప్త సైన్యము. శివబాబా గుప్తమైనవారు, అలాగే వారి సైన్యము కూడా గుప్తమైనదే. శివశక్తి పాండవ సైన్యము. ఇదే సత్యాతి-సత్యమైన సత్యనారాయణ కథ, మిగిలినవన్నీ అసత్యమైన కథలే, అందుకే - చెడు చూడకూడదు, చెడు వినకూడదు అని అంటారు. నేను ఏదైతే అర్థం చేయిస్తానో, అదే వినండి.

ఇది అనంతమైన పెద్ద స్కూలు. ఈ యూనివర్సిటీ కొరకే ఈ ఇళ్ళను నిర్మించారు, చివరిలో పిల్లలు ఇక్కడకు వచ్చి ఉంటారు. ఎవరైతే యోగయుక్తముగా ఉంటారో వారే వచ్చి ఉంటారు. ఈ కళ్ళతో వినాశనాన్ని చూస్తారు. స్థాపన మరియు వినాశనం యొక్క సాక్షాత్కారమునేదైతే మీరు ఇప్పుడు దివ్య దృష్టితో చూస్తారో, దానిని తర్వాత మీరు ఈ కళ్ళతో చూస్తారు. ఇందులో చాలా విశాలబుద్ధి కావాలి. ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో అంతగా బుద్ధి తాళం తెరుచుకుంటూ ఉంటుంది. ఒకవేళ వికారాలలోకి వెళ్ళినట్లయితే తాళం పూర్తిగా మూసుకుపోతుంది. స్కూల్ వదిలేసారంటే ఇక జ్ఞానం బుద్ధి నుండి పూర్తిగా తొలగిపోతుంది. పతితులుగా అయ్యారంటే ఇక ధారణ జరగదు. ఎంతో శ్రమ ఉంది. ఇది విశ్వానికి యజమానులుగా అయ్యే కాలేజీ. ఈ బ్రహ్మాకుమార-కుమారీలు శివబాబాకు మనువలు-మనువరాళ్ళు. వీరు ఇప్పుడు భారత్ ను స్వర్గముగా తయారుచేస్తున్నారు. వీరు ఆత్మిక సమాజ సేవకులు, వీరు ప్రపంచాన్ని పావనముగా తయారుచేస్తున్నారు. ముఖ్యమైనది పవిత్రత. శ్రేష్ఠాచారీ ప్రపంచముగా ఉండేది, ఇప్పుడు భ్రష్టాచారీగా ఉంది. ఈ చక్రము తిరుగుతూ ఉంటుంది. ఈ దైవీ వృక్షం యొక్క అంటు కట్టబడుతోంది, ఇది మెల్లమెల్లగా వృద్ధి చెందుతుంది. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సత్యాతి-సత్యమైన ఆత్మిక ముక్తిదళముగా అయి భారత్ ను వికారాల నుండి రక్షించాలి. తండ్రికి సహాయకులుగా అయి ఆత్మిక సమాజ సేవను చేయాలి.

2. ఒక్క తండ్రి నుండే సత్యమైన విషయాలను వినాలి. చెడు వినకండి, చెడు చూడకండి... ఈ కళ్ళతో చివరి సమయంలోని దృశ్యాలను చూసేందుకు యోగయుక్తముగా అవ్వాలి.

వరదానము:- అప్సెట్ (డిస్టర్బ్) అయ్యేందుకు బదులుగా లెక్కాచారాలను సంతోషంగా తీర్చుకునే నిశ్చింత ఆత్మా భవ

ఒకవేళ ఎప్పుడైనా ఎవరైనా ఏదైనా విషయం అంటే దానికి వెంటనే అప్సెట్ అయిపోకండి. మొదట వారు ఏ భావంతో అన్నారు అన్నది స్పష్టం చేసుకోండి లేక వెరిఫై చేసుకోండి, ఒకవేళ అందులో మీ తప్పేమీ లేకపోతే నిశ్చింతులైపోండి. బ్రాహ్మణ ఆత్మల ద్వారా ఇక్కడే అన్ని లెక్కాచారాలు తీరనున్నాయి అన్న విషయం స్మృతిలో ఉండాలి. ధర్మరాజపురి నుండి సురక్షితులుగా అయ్యేందుకు బ్రాహ్మణులు ఎక్కడో అక్కడ నిమిత్తులవుతారు, అందుకే గాభరా పడకండి, సంతోషంగా తీర్చుకోండి. ఇందులో ఉన్నతియే జరుగనున్నది.

స్లోగన్:- ‘‘తండ్రే ప్రపంచము’’, సదా ఈ స్మృతిలో ఉండడమే సహజయోగము.

మాతేశ్వరిగారి మధుర మహావాక్యాలు

''అజపాజపము అనగా నిరంతర యోగము, ఎడతెగని యోగము''

ఓం శాంతి అని అన్నప్పుడు దాని యథార్థ అర్థము - నేను ఆత్మను, ఆ జ్యోతి స్వరూపుడైన పరమాత్ముని సంతానమును, మనము కూడా ఆ తండ్రి అయిన జ్యోతిర్బిందు పరమాత్ముని లాంటి ఆకారము కలవారము. అయితే మనము సాలిగ్రామాలైన పిల్లలము కనుక మనము మన జ్యోతి స్వరూపుడైన పరమాత్మునితో యోగము జోడించాలి, వారితోనే యోగాన్ని జోడించి లైట్-మైట్ యొక్క వారసత్వాన్ని తీసుకోవాలి, అందుకే గీతలో స్వయం భగవంతుని మహావాక్యము ఉంది - మన్మనాభవ, జ్యోతి స్వరూప తండ్రినైన నా సమానంగా పిల్లలైన మీరు కూడా నిరాకారీ స్వరూపములో స్థితులవ్వండి, దీనినే అజపాజపము అని అంటారు. అజపాజపము అనగా ఏదైనా మంత్రాన్ని జపించేందుకు బదులుగా న్యాచురల్ గా ఆ పరమాత్ముని స్మృతిలో ఉండటము, దీనినే పూర్ణ యోగము అని అంటారు. యోగము అంటే అర్థము, యోగేశ్వరుడైన ఆ ఒక్క పరమాత్ముని స్మృతిలో ఉండటము. కనుక ఏ ఆత్మలైతే ఆ పరమాత్ముని స్మృతిలో ఉంటారో, వారిని యోగులు లేక యోగినీలు అని అంటారు. ఎప్పుడైతే ఆ యోగములో అనగా స్మృతిలో నిరంతరము ఉంటారో, అప్పుడే వికర్మలు మరియు పాపాల భారము తొలగుతుంది మరియు ఆత్మలు పవిత్రంగా అవుతారు, దీని ద్వారా భవిష్య జన్మలో దేవతా ప్రారబ్ధము లభిస్తుంది. ఇప్పుడు జ్ఞానము కావాలి, అప్పుడే యోగము పూర్తిగా కుదరగలదు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమాత్ముని స్మృతిలో ఉండటము, ఇదే సత్యమైన జ్ఞానము. ఈ జ్ఞానము ద్వారానే యోగము కుదురుతుంది. అచ్చా. ఓం శాంతి.